క్లుప్తంగా

వేతనాల పెంపు హర్షణీయం

తిరుపతి కల్చరల్: టీటీడీ కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెంచడంపై సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ఇచ్చిన హామీ మేరకు కార్మికులకు రూ.5000 పెంచుతూ నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. టీటీడీలో మిగిలిన కార్మిక సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

టీటీడీ చైర్మన్ భూమన నిర్ణయం శుభపరిణామం

టీటీడీలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలను రూ.5 వేలు పెంచుతూ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి నిర్ణయం తీసుకోవడం శుభపరిణామమని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కేతారి రాధాకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. కాంట్రాక్ట్ కార్మికుల బతుకులకు భరోసా కల్పించిన టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఇతర కార్మికుల సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

వారపు సంతలో భోజనాలు



వారపు సంతలో భోజనాలు వడ్డిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పాకాల: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని వారపు సంతలో సోమవారం చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్, వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు భోజనాలు పెట్టారు. రైతులు, చిరువ్యాపారులు, ప్రజలు సంతలో ఆకలితో అలమటించకూడదని భావించి సొంత డబ్బులతో ఎమ్మెల్యే భోజనాలు ఏర్పాటుచేసినట్టు నాయకులు తెలిపారు.

అభివృద్ధి పనులు వేగవంతం

భాకరాపేట: మండలంలో తుడా ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని చిన్నగొట్టిగల్లు ఎంపీడీవో దేవేంద్ర బాబు ఆదేశించారు. ఆయన సోమవారం మండల ఇంజినీర్లు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశమయ్యారు.

ఆర్టీసీ ఉద్యోగులకు అభినందనలు



ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న డిపో మేనేజర్ హరిబాబు

తిరుపతి అర్బన్: తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో అధిక ఆదాయాన్ని తీసుకువచ్చిన ఆర్టీసీ బస్సుల కండక్టర్లు, డ్రైవర్లు, సూపర్‌వైజర్లు, గ్యారేజ్ సిబ్బంది, విద్యుత్ బస్సుల డ్రైవర్లను అలిపిరి డిపో మేనేజర్ హరిబాబు సోమవారం అభినందించారు. వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. జిల్లాలోని 11 డిపోల ద్వారా బ్రహ్మోత్సవాల్లో రూ.7 కోట్లు ఆదాయం వచ్చిందని, అందులో అలిపిరి డిపో నుంచి రూ.2.50 కోట్లు వచ్చినట్లు వెల్లడించారు. ఈ నెల 15వ తేదీ నుంచి నిర్వహించనున్న శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లోను అధిక ఆదాయం వచ్చేలా కృషి చేయాలని సూచించారు. సీజీ బాబు, కె.వి రత్నం, ఏఎస్ఎన్ కుమార్, పి భరాష, ఎస్ బావాజీ తదితరులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. అసిస్టెంట్ మేనేజర్ పుష్పలత పాల్గొన్నారు.

రూ.12 లక్షల గ్రాంట్ మంజూరు

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీలోని టీవోసీఐసీ కేంద్రం, పీఆర్ఐఎస్ఎం పథకం కింద స్టార్టప్‌లు, ఎంఎస్ఎంఈలలో ఆవిష్కరణలకు న్యూఢిల్లీలోని సైన్స్ అండ్ టెక్నాలజీ కేంద్ర మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ రూ.12 లక్షల వార్షిక గ్రాంట్‌ను అందించింది. వీసీ భారతి టీటీసీఐసీ కేంద్రం కృషిని అభినందించారు. ప్రొఫెసర్ పి జ్యోత్స్నకు గ్రాంట్ మంజూరు పత్రాలు అందజేశారు.

టీటీడీ చేతికి రోడ్ల నిర్వహణ బాధ్యత

- ధర్మకర్తల మండలి సమావేశంలో నిర్ణయం
- హర్షం వ్యక్తం చేస్తున్న తిరుపతి నగర వాసులు
- నగరం అభివృద్ధిలో పరుగులు తీస్తుందని ఆనందం



టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి

తిరుమల: తిరుపతి నగరంలోని ప్రధాన రహదారుల మరమ్మతులకు టీటీడీ ధర్మకర్తల మండలి నిర్ణయం తీసుకుంది. తిరుమలలో సోమవారం నిర్వహించిన ధర్మకర్తల మండలి సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ఒక గ్రామంగా ఉన్న తిరుపతి శ్రీవారి దయతో నగరంగా అభివృద్ధి చెందింది. దూరప్రాంతాల నుంచి వచ్చే యాత్రికుల సౌకర్యార్థం తిరుపతిలోని ముఖ్య రహదారులను మరమ్మతులు చేయడంతోపాటు వాటి నిర్వహణ బాధ్యతను టీటీడీ తీసుకుంది. ఇక్కడ టీటీడీకి చెందిన ఆలయాలతోపాటు సంస్థలు, వసతి సముదాయాలు ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాల్సిన అవసరాన్ని గుర్తించి నిర్వహణ బాధ్యతను చేపట్టాలని నిర్ణయించింది.

మరికొన్ని ముఖ్య నిర్ణయాలు

- ప్రయివేటు సంస్థలన్నీ కార్పొరేట్ సామాజిక బాధ్యతగా అభివృద్ధి పనులు చేస్తున్న విషయం తెలిసిందే. టీటీడీ కూడా తన సామాజిక బాధ్యతగా వేలాది మంది భక్తులు వచ్చే తిరుపతి పట్టణాన్ని కూడా అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ఉంది. కాబట్టి ప్రతి సంవత్సరమూ టీటీడీ బడ్జెట్‌లో ఒక శాతం తిరుపతి అభివృద్ధికి ఖర్చు పెట్టాలని నిర్ణయం తీసుకుంది.
- తిరుమలలోని జాపాలి తీర్థం, వేణుగోపాల స్వామి ఆలయం, ఆకాశగంగ, పాపవినాశం ప్రాంతాలకు వెళ్లే మార్గంలో ప్రస్తుతం ఉన్న రెండు లేన్ల రోడ్డు సామర్థ్యం సరిపోనందున ఆకాశగంగ నుంచి ఔటర్ రింగ్ రోడ్డు వరకు రూ.40 కోట్లతో నాలుగు లేన్లుగా విస్తరించేందుకు పరిపాలన అనుమతికి ఆమోదం. ఇందులో గోగర్భం డ్యామ్ భద్రత దష్ట్యా రోడ్డు నిర్మాణం డ్యామ్‌కు దిగువన వచ్చేలా ప్లాన్ రూపకల్పన.
- చెర్లోపల్లి నుంచి శ్రీనివాసమంగాపురం, శ్రీవారి మెట్టు మార్గాల్లో తిరుమలకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం నాలుగు లేన్ల రోడ్డుగా విస్తరించి బీటీ రోడ్డు, వీధి దీపాలు, డ్రెయిన్లు, సుందరీకరణ పనులు చేపట్టేందుకు రూ.25 కోట్లతో పరిపాలన అనుమతులు మంజూరుకు ఆమోదం.
- టీటీడీ పాఠశాలల్లో చదువుతున్న 3,259 మంది విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన పౌష్టికాహారాన్ని అందించేందుకు 2023–24 విద్యా సంవత్సరం నుంచి టీటీడీ మధ్యాహ్న భోజనాన్ని అందిస్తోంది. గతంలో ఇస్కాన్ సంస్థ సరఫరా చేస్తున్న మధ్యాహ్న భోజనాన్ని నిలిపివేసి సమీపంలోని టీటీడీ కళాశాలల హాస్టళ్ల నుంచి మధ్యాహ్న భోజనాన్ని సరఫరా చేస్తోంది. అన్నం, సాంబారు, కూర, రసం, చట్నీ, పెరుగు లేదా మజ్జిగను మెనుగా దిట్టాన్ని నిర్ణయించింది. ఇందుకుగాను సంవత్సరానికి రూ.2.63 కోట్లకు పైగా వ్యయం చేయడానికి ఆమోదం.
- దూరప్రాంతాల నుంచి వచ్చే యాత్రికులు తమ బస్సులు, ఇతర వాహనాలను అలిపిరిలో పార్క్ చేసి తిరుమలకు వెళ్లడం ఆనవాయితీగా వస్తోంది. అలిపిరిలో ప్రస్తుతం 130 వాహనాలను పార్క్ చేసేందుకు 2.47 ఎకరాలు మాత్రమే అందుబాటులో ఉంది. రోజురోజుకూ పెరుగుతున్న యాత్రికుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని అదనంగా మరో 156 బస్సులు, 683 కార్లు/జీపులు, 1325 ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేసుకునే విధంగా, 7 అదనపు టాయ్‌లెట్లు, యాత్రికులు వంట చేసుకునేందుకు అనువుగా మూడు షెడ్ల నిర్మాణానికి మరో 11.34 ఎకరాలు అభివృద్ధి చేసి, ఇక్కడ బీటీ రోడ్లు, భూదేవి కాంప్లెక్సు వద్ద దర్శన టోకెన్లు పొందే భక్తులకు క్యూలు, లైటింగ్ తదితర వసతులు కల్పించేందుకు రూ.21.60 కోట్లతో పరిపాలన అనుమతికి ఆమోదం.

అల్లూరి పేరిట జిల్లా ప్రకటించడం అభినందనీయం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వెంగమ్మ దంపతులు

తిరుపతి కల్చరల్: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పేరిట జిల్లా ప్రకటించడం అభినందనీయమని విశ్రాంత ఆచార్యులు కె.వెంకటరెడ్డి కొనియాడారు. 66 మంది ఆంధ్ర స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను వివరిస్తూ ఎస్కేయూ విశ్రాంత వీసీ రచించిన 240 పేజీల పుస్తకాన్ని సోమవారం ఎస్వీనగర్‌లోని విశ్రాంత ఆచార్య నివాసంలో ఆవిష్కరించారు. ఇందులో ముఖ్య అతిథులుగా స్విమ్స్ మాజీ డైరెక్టర్ డాక్టర్ వెంగమాంబ, డాక్టర్ గోపాలరెడ్డి దంపతులు పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించారు. గ్రంథకర్త మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న ప్రధాని మోదీ స్వాతంత్ర్య సమరంలో ఆంధ్రుల త్యాగాలను ప్రశంసించడం అభినందనీయమన్నారు. దీని స్ఫూర్తితో ఈ పుస్తకం రాశానన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రిన్సిపాల్ స్వరాజ్యలక్ష్మి, సముద్రాల దశరథ, కోరం వెంకటాచలపతిరావు, అప్పాసామి పిళ్లై, నారాయణ, సుబ్రమణ్యం, జయరామిరెడ్డి, యశోద, సోము ఉమాపతి, కె.విజయ పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో మహిళకు ఏడాది జైలు

తిరుపతి లీగల్: ఇనుప రాడ్డుతో వ్యక్తిపై దాడి చేసి హత్యాయత్నం చేసిన తిరుపతి ఎస్టీవీ నగర్ వెంకటరెడ్డికాలనీకి చెందిన గుత్త హంసవేణి అలియాస్ కవితకు ఏడాది జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తిరుపతి అదనపు సీనియర్ సివిల్ జడ్జి సునితారాణి సోమవారం తీర్పు చెప్పారు. ఈస్టు సీఐ మహేశ్వర్‌రెడ్డి, కోర్టు కానిస్టేబుల్ అయ్యప్ప కథనం మేరకు.. ఎస్టీవీ నగర్‌కు చెందిన వీకె.రాము తన ఇంటి ముందున్న ఇంటిని హంసవేణికి విక్రయించాడు. అతని ఇంటి నుంచి ప్రధాన రోడ్డులోకి వెళ్లడానికి సందు దారి ఉండేది. ఇంటిని విక్రయించే సమయంలో అంగీకరించినట్టు ఆమె ఇంటిపై ఉండే సన్‌షేడ్‌ను తొలగించలేదు. ఈ విషయమై ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. పెద్ద మనుషులు రాజీ కుదిర్చి సన్‌షేడ్‌ను తొలగించారు. దీనిపై ఆమె కక్ష పెంచుకుని ఆ సందులో డ్రైనేజీ నీటిని వదలడం, తదితర పనులు చేస్తూ రాము కుటుంబ సభ్యులకు ఇబ్బంది కలిగించేవారు. ఈ నేపథ్యంలోనే 2020 ఆగస్టు 30వ తేదీ ఉదయం 4.20 గంటల సమయంలో రాము మార్కెట్‌కు బయలుదేరగా రాజరాజేశ్వరి ఆలయ సమీపంలో హంసవేణి ఇనుప రాడ్డుతో దాడి చేసి గాయపరిచింది. బాధితుడి ఫిర్యాదు మేరకు ఈస్టు పోలీసులు కేసు నమోదు చేసి ఆమెను కోర్టులో హాజరుపరిచారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ చెవిరెడ్డి శ్రీదేవి వాదించారు.

ఎండీయూ ఆపరేటర్ల సమస్యలు పరిష్కరించండి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎండీయూ ఆపరేటర్లు

చంద్రగిరి: మండలంలో సర్వర్ సమస్య కారణంగా రేషన్‌ను సక్రమంగా పంపిణీ చేయలేకపోతున్నామని మొబైల్ డిస్ట్రిబ్యూషన్ ఆపరేటర్స్ ఆవేదన వ్యక్తం చేశారు. వారు సోమవారం తహసీల్దార్ శిరీషకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ అక్టోబర్ 4వ తేదీ నుంచి ఈ పాస్ మెషిన్లు, డబుల్ ఫింగర్ ప్రింట్స్‌లో సాంకేతిక కారణాల వల్ల సమస్యలు తలెత్తుతాయన్నారు. ఈ కారణంగా రేషన్ పంపిణీలో ఆలస్యం అవుతోందని, దీంతో ప్రజలు భౌతిక దాడులకు దిగుతున్నారని తెలిపారు. సింగిల్ ఫింగర్ ప్రింట్ పనిచేసేలా చర్యలు తీసుకుంటే రేషన్ పంపిణీ సజావుగా సాగుతుందని చెప్పారు. ఎండీయూ ఆపరేటర్లు సుబ్రమణ్యం, మధు, అష్రఫ్, మాతయ్య, వెంకటేష్, క్రిష్ణమూర్తి, మునిరత్నం, భాస్కర్ రెడ్డి, రఫీ, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

శిక్షణా తరగతులను వాయిదా వేయాలి

తిరుపతి ఎడ్యుకేషన్: దసరా సెలవుల్లో ఉపాధ్యాయులకు నిర్వహించాలని తలపెట్టిన సాల్ట్ ప్రోగ్రామ్ శిక్షణా తరగతులను వాయిదా వేయాలని ఆపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలాజీ ఒక ప్రకటనలో కోరారు. ఉపాధ్యాయులకు మూడు విడతల్లో శిక్షణ ఇవ్వాలని విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వులు ఇచ్చారని తెలిపారు. మొదటి విడతగా ఈ నెల 9 నుంచి 14 వరకు, రెండో విడతగా 16 నుంచి 21 వరకు, మూడో విడతగా 26 నుంచి 31వ తేదీ వరకు శిక్షణా తరగతలు నిర్వహించేలా షెడ్యూలు ఇచ్చారని పేర్కొన్నారు. రెండో విడత శిక్షణా తరగతులు దసరా సెలవుల్లో ఉన్నాయని, దసరా ఉత్సవాలను స్వగ్రామాల్లో నిర్వహించుకునేందుకు ఉపాధ్యాయులు వారి స్వస్థలాలకు వెళతారని తెలిపారు. ఇలాంటప్పుడు శిక్షణా తరగతులకు ఎలా హాజరవుతారని, దీనిని దృష్టిలో ఉంచుకుని రెండో విడత శిక్షణా తరగతులను వాయిదా వేయాలని విద్యాశాఖ కమిషనర్‌కు మెయిల్ ద్వారా కోరామని, అందుకు వారు సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు.

తలకోనలో సిద్ధేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

భాకరాపేట: తలకోన సిద్ధేశ్వర స్వామి, సిద్ధేశ్వరి అమ్మవారికి సోమవారం విశేష పూజలు చేశారు. తెల్లవారుజామున సుప్రభాతంతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. అనంతరం విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం స్వామి, అమ్మవారు నంది వాహనంలో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు.

సుబ్రమణ్యస్వామి విగ్రహ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

పాకాల: ఆనందగిరి కొండపైనున్న సుబ్రమణ్య స్వామి ఆలయం వద్ద నిర్మిస్తున్న 54 అడుగుల విగ్రహానికి సోమవారం చెన్నుపాటివారిపల్లికి చెందిన రాఘవల్‌రెడ్డి సన్స్ రూ.51,116 విరాళం ఇచ్చారు. వారికి ఆలయ కమిటీ చైర్మన్ మహాసముద్రం పట్టాభిరెడ్డి స్వామి వారి దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అర్చకులు కృష్ణమూర్తిశర్మ, సిబ్బంది ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో మేఘాలయ గవర్నర్ కుటుంబ సభ్యులు

తిరుమల: శ్రీవారిని సోమవారం మేఘాలయ గవర్నర్ పాగు చౌహాన్ కుమారుడు కైలాస్ చౌహాన్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా అధికారులు లడ్డూ, ప్రసాదాలతో సత్కరించారు.

13 వరకు తపాలా వారోత్సవాలు

తిరుపతి అర్బన్: జాతీయ తపాలా వారోత్సవాలను సోమవారం నుంచి 13వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు పోస్టల్ పార్శల్ విభాగం సూపరింటెండెంట్ హరికృష్ణప్రసాద్ తెలిపారు. తపాలాశాఖ ఔన్నత్యాన్ని ప్రజలకు తెలియజేయడంతోపాటు విప్లవాత్మక మార్పులను ప్రజల చెంతకు చేర్చడమే ఈ వారోత్సవాల ఉద్దేశమని వెల్లడించారు. ప్రధానంగా స్పీడ్, రిజిస్టర్, పార్శల్ పోస్టులు, సాధారణ ఉత్తరాలను నిర్ణీత సమయానికి చేరవేస్తున్నట్లు తెలిపారు. నాలుగేళ్లుగా టీటీడీ వెబ్‌సైట్‌లో బుక్ అయిన క్యాలెండర్లు, డైరీలను స్వామి వారి భక్తులకు సకాలంలో, సురక్షితంగా చేర్చుతున్నట్లు పేర్కొన్నారు.

మేలును గుర్తించి మోహిత్‌రెడ్డిని ఆదరించండి



ప్రజలకు పథకాలను వివరిస్తున్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

రామచంద్రాపురం: ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చేసిన మేలును గుర్తు పెట్టుకుని వచ్చే ఎన్నికల్లో మోహిత్‌రెడ్డిని ఆదరించి గెలిపించాలని హర్షిత్‌రెడ్డి కోరారు. ఆయన సోమవారం కమ్మకండ్రిగ పంచాయతీలో గడప గడపకూ మీ హర్షిత్ కార్యక్రమం చేపట్టారు. ప్రతి ఇంటికీ వెళ్లి వారు ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని వివరించారు. వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ కమ్మకండ్రిగ పంచాయతీలో రూ.2.39 కోట్లతో అభివృద్ధి పనులు చేపటినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ ఏవీ బ్రహ్మానందరెడ్డి, జెడ్పీటీసీ ఢిల్లీరాణి, వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జి గణపతి నాయుడు, కమ్మకండ్రిగ సర్పంచ్ కావ్య, ఉప సర్పంచ్ వేణు గోపాల్ నాయుడు, పారిశ్రామికవేత్త లంబోధర నాయుడు, ఎంపీటీసీ చంద్రశేఖర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు బాబు యాదవ్, గంగిరెడ్డిపల్లి సర్పంచ్ భారతి, నాయకులు యశ్వంత్, కాకర్ల దేవరాజులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యాంధ్రప్రదేశే జగనన్న లక్ష్యం



వైద్య సేవలను పరిశీలిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

చంద్రగిరి: రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా చూడలన్నదే సీఎం జగనన్న ప్రధాన లక్ష్యమని వైఎస్సార్ సీపీ ఏ.రంగంపేట డివిజన్ అధ్యక్షుడు, ఎంపీటీసీ భోస్ చంద్రారెడ్డి తెలిపారు. మండలంలోని ఏ.రంగంపేటలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. 10 మంది డాక్టర్లు, ఆశావర్కర్లు ప్రజలకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. సుమారు 300 మందికి పైగా ప్రజలు వైద్య పరీక్షలు చేయించుకున్నట్టు వైద్యులు తెలిపారు. ఎంపీడీవో రమేష్ బాబు, తహసీల్దార్ శిరీష క్యాంపును పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఎంఈవో లలిత కుమారి, సర్పంచ్ ఎర్రయ్య, ఉప సర్పంచ్ మోనీష్ రెడ్డి, సెక్రటరీ శిరీష పాల్గొన్నారు.

వేద వర్సిటీతో పలు సంస్థల ఎంవోయూ



ఎంవోయూ పత్రాలు అందజేస్తున్న వేద వర్సిటీ వీసీ రాణీ సదాశివమూర్తి

తిరుపతి సిటీ: టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఎస్వీ వేద వర్సిటీలో పబ్లికేషన్ విభాగంలో నిర్వహిస్తున్న తాళపత్రాల డిజిటలైజేషన్ ప్రక్రియపై వీసీ ఆచార్య రాణీసదాశివమూర్తితో పలు సంస్థలు సోమవారం ఎంవోయూలు కుదుర్చుకున్నాయి. ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆర్కైవ్స్ డైరెక్టర్, ప్రాచ్య తాళపత్ర గ్రంథ డైరెక్టర్ వి.రంగరాజు ఆధ్వర్యంలో తాళపత్రాలను వేద వర్సిటీ సహకారంతో డిజిటలైజేషన్ చేయనున్నారు. అలాగే కడపకు చెందిన యోగివేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నడుస్తున్న సీపీ బ్రౌన్ లాంగ్వేజ్ రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో ఉన్న తాళపత్రాలను డిజిటలైజేషన్ చేసేందుకు డైరెక్టర్ ఆచార్య రామ్ ప్రసాద్ రెడ్డితో ఎంవోయూ కుదుర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ రాధేశ్యామ్, బద్వేలుకు చెందిన కవియిత్రి మొల్ల సాహిత్య పీఠం అధ్యక్షుడు విద్వాన్ జి.హనుమంతరావు, యోగి వేమన విశ్వవిద్యాలయ ఆచార్యులు ఎం మల్లికార్జున్ రెడ్డి పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ హరిత

తిరుపతి తుడా: ప్రజల నుంచి వచ్చే స్పందన ఫిర్యాదులకు తక్షణం పరిష్కారం చూపాలని, పరిష్కరించలేని వాటికి తగిన కారణాలతో వివరణ ఇవ్వాలని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత ఆదేశించారు. ఆమె సోమవారం డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం ఆమె అధికారులతో సమీక్షించారు. ఖాళీ స్థలాల్లో చెత్త వేయడం, నిల్వ ఉంచడం వల్ల దోమలు వృద్ధి చెందుతాయని, నగరంలోని ఖాళీ స్థల యజమానులు తమ స్థలాలను శుభ్రం చేయించుకోవాలని సూచించారు. ఖాళీ స్థలాల్లో చెత్త వేసే వారిని గుర్తించి జరిమానా విధించాలని శానిటేషన్ సిబ్బందిని ఆదేశించారు. డయల్ యువర్ కమిషనర్‌కు 29, స్పందనకు 33 ఫిర్యాదులు అందాయని, సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకుని సకాలంలో పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ మోహన్, మున్సిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, సెక్రటరీ రాధిక, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువఅన్వేష్ రెడ్డి, సిటీ ప్లానింగ్ అధికారులు శ్రీనివాసులు రెడ్డి, బాలసుబ్రమణ్యం, రెవెన్యూ అధికారులు కెఎల్ వర్మ, సేతుమాధవ్, వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ నాగేంద్ర రెడ్డి, మేనేజర్ చిట్టిబాబు పాల్గొన్నారు.

వేధింపుల కేసులో భర్తకు ఏడాది జైలు

తిరుపతి లీగల్: రెండో వివాహం చేసుకుని మొదటి భార్యను మానసికంగా వేధించిన కేసులో తిరుపతి ఎస్టీవీ నగర్‌కు చెందిన ఎస్.ధనుంజయరెడ్డికి ఏడాది జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ తిరుపతి నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ సోమవారం తీర్పు చెప్పారు. దిశ స్టేషన్ కోర్టు కానిస్టేబుల్ సురేంద్ర కథనం మేరకు.. ధనుంజయరెడ్డి వడమాలపేట మండలం కాలూరుకు చెందిన ఎస్.పుష్పవతిని 1997లో వివాహం చేసుకున్నాడు. వారికి ఒక పాప కలిగింది. ఆమె తల్లి దండ్రులు ఇచ్చిన సొమ్ముతో ధనుంజయరెడ్డి తిరుపతి తిలక్‌రోడ్డు, జగన్నాథపురంలోని ఓ ఇంటిని కొన్నాడు. మొదటి అంతస్తుల్లో షేర్ బ్రోకర్ వ్యాపారాన్ని ప్రారంభించాడు. తర్వాత వ్యాపారాన్ని గ్రౌండ్ ఫ్లోర్‌కు మార్చి తన సొంత గ్రామమైన ఆర్సీపురం మండలం నడవలూరులో కాపురం పెట్టాడు. షేర్ బ్రోకర్ ఆఫీసులో పనిచేస్తున్న పి.గౌరీ జ్యోతి అనే మహిళను రెండో వివాహం చేసుకుని తిరుపతి జగన్నాథపురంలోని ఇంట్లోనే కాపురం పెట్టాడు. వారికి ఒక బాబు కలిగాడు. ఈ విషయం తెలుసుకున్న మొదటి భార్య దిశ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్ఐ సంజీవ కుమార్ కేసు దర్యాప్తు చేసి నిందితులను కోర్టులో హాజరుపరిచారు. నేరం ధనుంజయరెడ్డిపై మాత్రం రుజువు కావడంతో అతనికి శిక్ష విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు. గౌరీజ్యోతిపై కేసును కొట్టి వేశారు.

బంజారాలతో ధార్మిక పరిషత్‌ను ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న బాబురావు చౌహాన్

తిరుపతి కల్చరల్: హథీరాం బావాజీ మఠం ఆస్తుల పరిరక్షణ కోసం బంజారాలతో ధార్మిక పరిషత్‌ను ఏర్పాటు చేయాలని అఖిల భారత్ బంజారా సేవా సంఘ్ జాతీయ అధ్యక్షుడు బాబురావు చౌహాన్ కోరారు. ఆయన సోమవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. దేశ వ్యాప్తంగా ఉన్న బంజారాలు ఒకే భాష, ఒకే వేషం, సంస్కృతి, సంప్రదాయం, ఇతిహాసం కలిగి ఉన్న జాతి అని తెలిపారు. దేశ వ్యాప్తంగా సుమారు 15 కోట్ల మంది జనాభా ఉన్నట్టు తెలిపారు. హథీరాం బావాజీ మఠంలో అనేక కుంభకోణాలు జరుగుతున్నాయని ఆరోపించారు. మఠం ఆస్తులు అన్యాక్రాంతం అవుతున్నాయని వాపోయారు. ఈ నేపథ్యంలో మఠం ఆస్తులను పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. బంజారా సేవా సంఘ్ నేతలు భాస్కర్, బాలాజీ, అమృతనాయక్, మోహన్‌నాయక్ పాల్గొన్నారు.

లిడ్ క్యాప్ భూములను పరిరక్షించాలని వినతి

తిరుపతి అర్బన్: దామినేడు లెక్క దాఖలా సర్వే నెంబర్ 71, 7 1/2, 72/3, 101/2 సర్వే నెంబర్లలోని 5 ఎకరాల భూమిని ఆక్రమించడానికి కొందరు ప్రయత్నిస్తున్నారని, దాని చుట్టూ ఫెన్సింగ్ వేయాలని మాదిగ లిడ్ క్యాప్ భూముల పరిరక్షణ కమిటీ నాయకులు, వివిధ దళిత సంఘాల నేతలు కోరారు. వారు సోమవారం స్పందనలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో లిడ్ క్యాప్ భూముల పరిరక్షణ కమిటీ ప్రధాన కార్యదర్శి ఎస్ గంగాధరం, మాదిగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.వాలముని, ఎమ్మార్పీఎస్ నాయకుడు ఈ.ఆదయ్య, డప్పు కళాకారుల సంఘం నాయకులు గాంధీ, కృష్ణ, రవికుమార్, కాటయ్య, మునిరాజా, పెంచలయ్య, కరాటపు శంకర్ పాల్గొన్నారు.

ఎటుచూసినా గోవిందుడి నామాలే

కలియుగ వైకుంఠం తిరుమల. ఏడు కొండల వాడిని స్మరించినంతనే కష్టాలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం. అందుకే కాలినడకన తిరుమల వెళ్లేందుకు ఇష్టపడతారు. వారికి ఇబ్బంది కలుగకూడదన్న ఉద్దేశంతో టీటీడీ దాతల సహాయంతో అలిపిరి కాలినడక మార్గాన్ని అభివృద్ధి చేసింది. భక్తులకు ఎండ, వాన నుంచి రక్షణగా కప్పు నిర్మించింది. వాటి గోడలకు ఇరువైపులా గోవింద నామాలను రాశారు. నడకదారిలో వెళ్లే భక్తులు గోవింద నామస్మరణ చేస్తూ ముందుకు సాగుతున్నారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి



శేషాచలం.. - పచ్చ తోరణం



ఆధ్యాత్మిక క్షేత్రం తిరుమల గిరులు పచ్చదనాన్ని సంతరించుకున్నాయి. ఎటు చూసినా పచ్చటి చెట్లతో ఆహ్లాదకర వాతావరణంతో భక్తులను మైమరిస్తున్నాయి. కాలినడకన వెళ్లే వారితోపాటు వాహనాల్లో వెళ్లే ప్రకృతి ప్రేమికులు పచ్చదనాన్ని చూసి తన్మయత్వంలో మునిగిపోతున్నారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి